క్లుప్తంగా

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



అన్నవరం(జగ్గయ్యపేట): గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో వైద్య శిబిరం నిర్వహించి భూచవరం వైద్యాధికారి స్రవంతి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగలక్ష్మి, వెంకట్రావ్ పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



పెనుగంచిప్రోలు: రైతులకు ప్రభుత్వం అండగా ఎన్నో పథకాలు అందిస్తోందని ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా వైఎస్సార్ జలకళ కార్యక్రమంలో పొలాల్లో బోర్లు వేసిన ఐదుగురు రైతులకు మోటార్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ సిద్ధారెడ్డి, ఢిల్లీ నుంచి సెంట్రల్ సెక్రటేరియేట్ సర్వీసెస్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: వీఆర్వోలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు ఆయా గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు.

31న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీ ఉదయం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి ఈఓ భ్రమరాంబ మంగళవారం తెలిపారు. ఆ రోజు తెల్లవారుజాము 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితార, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా మహా మండపానికి చేరుతుందని వివరించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో పాటు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తజనుల కోలాట నృత్యాల మధ్య గిరి ప్రదక్షిణ జరుగుతుందని పేర్కొన్నారు.

రేపు సిద్ధార్థ ఆడిటోరియంలో జానపద గీతాలాపన

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 31వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు జానకీరావు బృందంతో జానపద గీతాలాపన కార్యక్రమం జరుగుతుందని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన యువజనోత్సవ పోటీల్లో జానకీరావు బృందం నాలుగు సార్లు ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారందరూ ఉచితంగానే ఈ ప్రదర్శనను తిలకించొచ్చని సూచించారు.

దుర్గగుడిలో శాస్త్రోక్తంగా ఉదకశాంతి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సాయంత్రం ఉదకశాంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ముందు రోజు ఉదకశాంతి నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య వైదిక సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ భ్రమరాంబ, ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటాలి



క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసిన ఉపాధ్యాయులు



లింగాలపాడు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన తెలుగు భాషాదినోత్సవం



చందర్లపాడులో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు

వత్సవాయి: తెలుగుభాషా ఔన్నత్యాన్ని చాటేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పలువురు వక్తలు పేర్కొనారు. తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మక్కపేట, చిన్నమోదుగపల్లి, వత్సవాయి, దబ్బాకుపల్లి పలు పాఠశాలల్లో తెలుగుభాషా ఉద్యమ వ్యవస్థాపకుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయురాలు ఎం.జయశ్రీ పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: మాతృభాషా దినోత్సవాన్ని పట్టణంలో మంగళవారం పలు విద్యాసంస్థలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో తెలుగు భాషా దినోత్సవం రసమయి సాహితీ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, కవి, ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని వివిధ పాఠశాలల్లోని తెలుగు భాష ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని సత్కరించారు. మక్కపేట, గోపినేనిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్స్ హెచ్‌ఎంలు చిత్రాల వెంకటేశ్వర్లు, ఆర్‌ఎల్.ప్రసాద్, గ్రంథాలయ అధికారి ఎ.ప్రభ పాల్గొన్నారు.

'అమ్మ' అని పిలుపులో కమ్మదనం ఉంది

పెనుగంచిప్రోలు: 'అమ్మ' అని పిలవడంలోనే కమ్మదనం ఉంటుందని హెచ్‌ఎం కె.జలజ అన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు భరతమాత, ఇతర దేశనాయకుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాటలు, నృత్యాలతో సందడి చేశారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు క్రీడల్లో పోటీల్లో నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు పాల్గొన్నారు.

ధర్మవరప్పాడుతండాలో..

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణరావు, బాలాజీ, సుజాత, వసంత పాల్గొన్నారు. అదే విధంగా గంట్రాయిలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతారామిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా తెలుగు భాష దినోత్సవ వేడుకలను విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నందిగామ పట్టణం, మాగల్లు , లింగాలపాడు, పెద్దవరం గ్రామాలలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని పల్లగిరి, రామిరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు భాష దినోత్సవాన్ని సందడిగా నిర్వహించారు.

కళాకారుల భవనంలో..

బళ్లారి రాఘవ కళా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని కళాకారుల భవనంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణ సాయి గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రంగం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాలలో కళాకారులు గరికపాటి భాస్కరం (నానయ్య), రాజేష్, నవీన్, దామోదర్, సుధాకర్ పాల్గొన్నారు.

చందర్లపాడులో..

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన, పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు, గుర్రం జాషువా వంటి ప్రముఖులు చేసిన కృషిని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ముందుగా విద్యార్థులు సాంప్రదాయ వేషధారణలలో నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణకుమారి, శివనాగలక్ష్మీ, శివనాగేశ్వరరావు, శ్రీలత, కిరణ్‌కుమార్, రమేష్, గిరి, రూప్లా, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, పద్మలత, శశీదేవి పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు మంగళవారం జరుపుకున్నారు. ముందుగా రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు గిడుగు వెంకటరామ్మూర్తి అన్నారు. ఆయన జయంతి వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు షేక్ ఇస్మాయేలు, శివజ్యోతి, పీ కుమారి, ఏవీడీ కుమారి, వెంకట్రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..

తెలుగు భాషా వారోత్సవాలను స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుపుకున్నామని గ్రంథాలయ పాలకుడు అల్లూరు రామచంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో మాజీ గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కంచికచర్లలో రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం సుబ్బారెడ్డి



ధర్మవరప్పాడుతండాలో తెలుగు ఔన్నత్యాన్ని చాటుతున్న విద్యార్థులు



గ్రంథాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవి దోసపాటి



నందిగామలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ సాయి

జలజీవన్ మిషన్ పైపులను పరిశీలించిన ఉదయభాను



జలజీవన్ మిషన్ పైపులను పరిశీలిస్తున్న ఉదయభాను

వత్సవాయి: జల్‌జీవన్ మిషన్ పైపులను ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను మంగళవారం పరిశీలించారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా వత్సవాయికి తాగునీరు నిమిత్తం రూ.3 కోట్ల 26 లక్షలతో మునేటి అవతల ఒడ్డు నుంచి ఆరు కిలోమీటర్ల మేర పైపులైన్ వేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూ.100 కోట్లతో జలజీవన్ పథకం ద్వారా పైపులైన్ ఏర్పాటుచేసి ఇంటింటికీ తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి,మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, భూక్యా రాజానాయక్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

నందిగామ: విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వి.లక్ష్మీరాజ్యం అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మంగళవారం సాయంత్రం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తున్న జగనన్న



పాస్‌లు పొందిన విద్యార్థులతో ఫౌండేషన్ చైర్మన్ విమలాభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మంగళవారం విమలాభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత బస్‌పాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఫాషా మాట్లాడుతూ పాస్‌ల ప్రింటింగ్, లామినేషన్‌ను అయ్యే ఖర్చును కూడా భరిస్తూ మొత్తం 220 మంది విద్యార్థులకు ఉచితంగా పాస్‌లు అందజేసినట్లు తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ విమలాభాను మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు జగ్గయ్యపేట పట్టణంలో ఉన్న విద్యా సంస్థలకు చదువు నిమిత్తం రోజూ బస్సుల్లో రాకపోకలు సాధించేందుకు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని తమ ఫౌండేషన్ దృష్టికి రావడంతో 220 మంది విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు అందజేసినట్లు తెలిపారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్లు పలువురిని ఆకట్టుకున్నాయి. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, సలాది సూరిబాబు, విశ్వభారతి-శ్రీలక్ష్య విద్యా సంస్థల ప్రిన్సిపాల్ పద్మశేఖర్, పాఠశాల హెచ్‌ఎం.మాధవీలత పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ విమలాభాను మాట్లాడుతూ మాతృభాషను మరచిపోవద్దన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ హెచ్‌ఎం.మాధవీలత, స్టాఫ్ సెక్రటరీ కె.కరుణాకర్, తెలుగు ఉపాధ్యాయులు శ్రీహరి, నాగమణి, సౌందర్య, రాధాకృష్ణ, సంజీవరావు, బేబీ శాంతి పాల్గొన్నారు.

లంకా సంగీత సంస్మరణోత్సవాలు ప్రారంభం

విజయవాడ కల్చరల్: లయనాద కళాస్రవంతి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఐదు రోజులపాటు నిర్వహించే లంకా వేంకటేశ్వర్లు సంగీత సంస్మరణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కె.వి.కిషోర్, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు సంగీత పాఠశాల విద్యార్థులు ఆలపించిన బృందగానం అలరించింది. భమిడిపాటి శ్రీలలిత, మల్లాది కార్తీక త్రివేణి గాత్ర సంగీతకచేరీ శ్రావ్యంగా సాగింది. లయనాద కళాస్రవంతి వ్యవస్థాపకులు కె.మాధవి మాట్లాడుతూ.. సంగీత విద్వాంసుడు లంకా వేంకటేశ్వర్లు పేరుతో ఏటా సంగీతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అత్తింటివారి వేధింపులపై మహిళ ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): భర్తతో కలిసి అత్త, ఆడపడుచు, మరిది మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని ఓ మహిళ మంగళవారం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. వాంబే కాలనీ జీ బ్లాక్‌లో నివసించే దాసరి వీరాంజనేయులుకు దాసరి సౌజన్యతో 2018వ సంవత్సరంలో వివాహమైంది. వివాహమైనప్పటి నుంచి భార్యపై అనుమానంతో వీరాంజనేయులు రోజూ మద్యం తాగొచ్చి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. కట్నం చాల్లేదని, వేరే పెళ్లి చేసుకొంటానని బెదిరించేవాడు. భర్తతో పాటు అత్త, ఆడపడుచు, మరిది కూడా వేధిస్తుండటంతో సౌజన్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అభయాంజనేయుని సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన రాగిపిండి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు అంకిత్‌రెడ్డి అన్నదానానికి విరాళం అందజేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్లు సమర్పించాలి

నందిగామ ఆర్డీఓ రవీంద్రరావు



పరిటాలలో ఓటర్ల వివరాలను తెలుసుకుంటున్న ఆర్డీఓ రవీంద్రరావు

కంచికచర్ల: గ్రామాల్లో ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిందని ప్రాపర్ డాక్యుమెంట్లు ఉంటేనే ఓటరు లిస్టులో చేర్పులు మార్పులు జరుగుతాయని నందిగామ ఆర్డీఓ ఏ రవీంద్రరావు అన్నారు. మండలంలోని పరిటాల, కీసర, కంచికచర్ల, పెండ్యాల గ్రామాల్లో మరణించిన వారి ఓట్లు తొలగింపుపై మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నందిగామ డివిజన్ పరిధిలో ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మరణించిన వారి ఓట్లను తొలగించే సమయంలో వారి మరణధ్రువీకరణపత్రం తప్పనిసరిగా సమర్పించాలన్నారు. కొత్తగా ఓటర్ల నమోదు కోసం సంబంధిత దరఖాస్తుదారుల పుట్టినరోజు సర్టిఫికెట్, స్కూల్ సర్టిఫికెట్లను అందజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీ శంకర బాబు, డిప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా, బీఎల్‌ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

స్వచ్ఛ జగ్గయ్యపేట లక్ష్యంగా చర్యలు

-మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



ఎర్రకాలువ ప్రక్షాళన పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణానికి అన్ని విధాలుగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టి స్వచ్ఛ జగ్గయ్యపేటగా తీర్చి దిద్దనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా మంగళవారం ఎర్రకాలువ ప్రక్షాళన పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ పట్టణంలోని పలు వార్డుల మీదుగా ప్రవహిస్తున్న ఎర్రకాలువ పరిసర ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రక్షాళన పనులను చేపట్టినట్లు తెలిపారు. గుర్రపుడెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, చెదారం అడ్డుపడి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని, తద్వారా మురుగు నీరు నిలిచి ఉండుట వలన దోమల వృద్ధి చెందుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రక్షాళన పనుల వలన నీటి ప్రవాహం సక్రమంగా ఉండటమే కాకుండా ఊర చెరువుకు ఎక్కువ నీరు చేరి చెరువు ఆయకట్టు కింద ఉన్న రైతులకు పుష్కలంగా నీరు లభిస్తుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్ పందుల రోశయ్య, కొరకూటి సైదులు, ఇరిగేషన్ డీఈ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విజయశేఖర్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రభుత్వ విప్ ఉదయభాను



విజయశేఖర్ సంతాప సభలో నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: చిల్లకల్లు గ్రామ అభివృద్ధితో పాటు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా ముత్తినేని విజయశేఖర్ రైతులకు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం రాత్రి చిల్లకల్లు గ్రామ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, మార్కెట్ యార్డు చైర్మన్ ముత్తినేని విజయశేఖర్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ విజయశేఖర్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. సీనియర్ నాయకుడుగా ఉన్న విజయశేఖర్‌కు జిల్లా స్థాయి పదవులు ఇస్తామని చెప్పినప్పటికీ తాను గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ఉండటం తనకు సంతోషం అని పదే పదే చెపుతుండేవారన్నారు. పార్టీకి అంకిత భావంతో పనిచేస్తూ ఉండే విజయశేఖర్ మృతి బాధాకరం అన్నారు.

పాముకాటుకు మహిళ మృతి

చందర్లపాడు(నందిగామ టౌన్): పాము కాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. చందర్లపాడు మండలంలోని వెలదికొత్తపాలెం గ్రామానికి చెందిన కామసాని పార్వతి(45) అల్లూరి భాస్కరరావుకు చెందిన సుబాబుల్ పొలంలో చెత్త వేరేందుకు వెళ్లారు.

ఈ క్రమంలో పొలంలో పనులు చేస్తున్న ఆమె రక్త పింజరు కాటుకు గురయ్యారు. మహిళను హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఎస్‌జీఎస్ కళాశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

జగ్గయ్యపేట అర్బన్: శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాలలో 1974-77లో బీకాం, బీఏ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కోదాడ రోడ్‌లోని బి-కన్వెన్షన్ హాల్లో ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో సుమారు 40 మంది హాజరై తమ జీవిత పరిణామక్రమాలను, అలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. గోపాలకృష్ణ సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న కోలపల్లి వెంకటేశ్వరరావు(బుల్లిబాబు), శ్రీరామ్ కనకదుర్గ ప్రసాద్, పసుపులేటి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, మాజీమంత్రి నెట్టెం రఘురాం పాల్గొని తమ జ్ఞాపకాలను సహచర విద్యార్థులతో పంచుకున్నారు. తమకు బోధించిన అధ్యాపకులు మేజర్ ఎస్‌వీ.సత్యానారాయణ, లక్ష్మీనారాయణ, బి.విజయలక్ష్మి, కె.సత్యనారాయణరావును పూర్వ విద్యార్థులు సన్మానించారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

కంచికచర్ల: మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించామని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నిమ్మగడ్డ శౌరయ్య మంగళవారం తెలిపారు. ముందుగా క్రీడలను కళాశాల సీఈఓ డి పాండురంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ టీ వంశీకిరణ్ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ హాకీ క్రీడాకారుడని అనేక గోల్డ్‌మెడల్స్ సాధించి దేశానికి అందించారన్నారు. అనంతరం పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి ఈనెల 30వ తేదీన బహుమతులు అందజేయనున్నట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పీడీలు సురేష్, అశోక్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.



మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు